క్లుప్తంగా

జేసీబీ పట్టివేత



వేమవరం(వత్సవాయి): అనుమతులు లేకుండా ఇసుకను లోడ్ చేస్తున్న జేసీబీని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే వేమవరం పరిధిలో ఇసుకను జేసీబీతో ట్రాక్టర్లకు లోడింగ్ చేస్తున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లేసరికి డ్రైవర్లు ట్రాక్టర్లతో సహా పరారయ్యారు. దీంతో పోలీసులు జేసీబీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న వైనంపై కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనుగంచిప్రోలు: గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ కె.దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మద్యంషాపులకు దరఖాస్తు గడువు పెంపు

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గీతా కార్మికులకు కేటాయించిన మూడు మద్యంషాపులకు 17 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సీఐ గురవయ్య బుధవారం తెలిపారు. మద్యంషాపులకు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 8వతేదీ వరకు పొడిగించినట్లు వివరించారు. ఈనెల 10న గొల్లపూడిలోని బీసీ భవన్‌లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా ద్వారా ఆయా షాపులు కేటాయిస్తారని వివరించారు. ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో..

కంచికచర్ల: కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వీరులపాడు మండలంలో గీత కులాలకు కేటాయించిన మద్యం దుకాణానికి ఈనెల 8వతేదీ సాయంత్రం ఐదుగంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ షేక్ అప్రపున్నీసా బేగం బుధవారం సూచించారు. ఈనెల 10న గొల్లపూడి బీసీ భవన్‌లో ఉదయం 10గంటలకు డ్రా తీస్తామన్నారు. జిల్లాలోని 11 మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకోవచ్చని సీఐ సూచించారు.

ఆకుకూరలు పంపిణీ



పెనుగంచిప్రోలు: గ్రామంలోని 12వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఈసీసీఈడే నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్రంలోని 3 నుంచి 6ఏళ్ల లోపు పిల్లలకు ఎత్తు, బరువులు చూసి తల్లులకు వారి ఎదుగుదల గురించి వివరించారు. తల్లులకు అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో రసాయనాలు వాడకుండా పెంచిన ఆకుకూరలు పంపిణీ చేశారు. అలాగే ప్రీస్కూల్ సంసిద్ధత వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.సువర్చల, రాజ్యలక్ష్మి, వై. సునీత, డి.వాణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనం తగదంటూ ఎమ్మెల్యేకు వినతి

చందర్లపాడు(కంచికచర్ల): చందర్లపాడు మండలం ముప్పాళ్ల ఎస్సీ కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలను మరో పాఠశాలలో విలీనం చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ మేరకు కాలనీవాసులు బుధవారం నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాల విలీనం ఆలోచనను ప్రభుత్వం మానుకునేలా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ఉన్నారు.

లారీడ్రైవర్లకు అవగాహన



బూదవాడ(జగ్గయ్యపేట): లారీడ్రైవర్లు అధిక వేగం నియంత్రించాలని జగ్గయ్యపేట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నారాయణరాజు సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గ్రామంలోని అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో బుధవారం లారీ డ్రైవర్లకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఓవర్‌లోడ్ ప్రయాణం తగదన్నారు. ముఖ్యంగా లారీ డ్రైవర్లు డ్రైవింగ్ రాని క్లీనర్లకు వాహనాలు ఇస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అందరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో యూనిట్‌హెడ్ శివరాజ్‌గౌరవ్, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమట్టి అక్రమ తరలింపు

- ఇటుక బట్టీలకు మంగొల్లు చెరువు మట్టి
- జేబులు నింపుకుంటున్న టీడీపీ నాయకులు
- ఆరునెలల కిందట పొలంలో నల్లమట్టి డంప్
- తాజాగా ఇటుక బట్టీలకు తరలింపు
- పట్టించుకోని అధికారులు



ఇటుక బట్టీలకు తరలించేందుకు జేసీబీల ద్వారా నల్లమట్టిని టిప్పర్‌కు లోడింగ్ చేస్తున్న వైనం

మంగొల్లు(వత్సవాయి): ఎనిమిది నెలల కిందట కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో మంగొల్లు గ్రామ టీడీపీ నాయకులు, చెరువు నుంచి తెచ్చి అక్రమంగా డంప్ చేసిన నల్లమట్టిని తాజాగా ఇసుక బట్టీల కోసం తరలిస్తున్నారు. నాయకులు ఇలా చెరువు మట్టిని ఇలా అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నా, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

మెరక పేరుతో మట్టి తరలింపు...

గతేడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే మంగొల్లుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు గ్రామంలోని చెరువు మట్టిని అక్రమ తరలింపు చేపట్టారు. ఇందుకు ఓ మూడెకరాల పొలాన్ని లీజుకు తీసుకుని నల్లమట్టిని ట్రాక్టర్ ద్వారా అక్కడికి తరలించి నిల్వచేశారు. ఈ విషయంపై గ్రామస్తులు అప్పుడు అధికారులకు ఫిర్యాదు చేసినా లాభం లేకపోయింది. గ్రామంలోని పొలాలను మెరక చేసుకునేందుకు, పంట పొలాలు మరింత సారవంతంగా మారేందుకు మాత్రమే నల్లమట్టిని తరలిస్తున్నామంటూ సదరు నాయకులు అటు గ్రామస్తులు, ఇటు అధికారులను మభ్యపెట్టారు. ఇలా చెరువు నుంచి వందలాది ట్రాక్టర్ల నల్లమట్టిని తరలించి డంప్ చేయడం గమనార్హం.



మంగొల్లులో నిల్వ చేసిన నల్లమట్టి

నేడు ఇటుక బట్టీలకు తరలింపు...

ఇలా డంప్ చేసిన నల్లమట్టిని ప్రస్తుతం సదరు టీడీపీ నాయకులు ఇటుక బట్టీల నిర్వాహకులకు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలోని ఎర్రఇటుకకు మంచి గిరాకీ ఉండడంతో రాజమండ్రి పరిపర ప్రాంతాల్లోని కొందరు వ్యాపారులు జగ్గయ్యపేట పరిసర ప్రాంతాలకు వచ్చి పొలాలను లీజుకు తీసుకొని ఇటుకబట్టీలను నిర్వహిస్తుంటారు. ఇలా మంగొల్లులో డంప్ చేసిన నల్లమట్టి ఇక్కడ్నుంచి జగ్గయ్యపేట మండలం గండ్రాయి, చిల్లకల్లు గ్రామాల పరిధిలోని ఇటుక బట్టీలకు తరలిపోతోంది. జేసీబీ ఏర్పాటు చేసి మరీ టిప్పర్ల ద్వారా ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తున్నప్పటికీ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదు. నల్లమట్టి విక్రయాల ద్వారా సదరు టీడీపీ నాయకులు లక్షలాది రూపాయలను స్వాహా చేస్తున్న వైనంపై ఇప్పటికే వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారు మిన్నకుండిపోవడం గమనార్హం. ఇకనైనా అధికారులు స్పందించి ఈనల్లమట్టి అక్రమ తరలింపును అడ్డుకోవాలని మంగొల్లు గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై వత్సవాయి తహశీల్దార్ కె.ప్రభుకుమార్‌ను వివరణ కోరగా మట్టి తరలింపు విషయం మా దృష్టికి రాలేదని తెలిపారు. పరిశీలించి మట్టిని తరలించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు.

పైప్‌లైన్ లీకేజీతో హైవే జలమయం



పైప్‌లైన్ లీకై రోడ్డుపై ప్రవహిస్తున్న తాగునీరు

నందిగామటౌన్(కంచికచర్ల): నందిగామకు తాగునీటిని సరఫరా చేసే మంచినీటి పైప్‌లైన్ లీకేజీతో పట్టణంలోని రైతుపేట ప్రాంతంలో జాతీయ రహదారి జలమయమైంది. కంచికచర్ల మండలం కీసర మునేటి నుంచి నందిగామ పట్టణానికి మంచి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్ బుధవారం లీకేజీకి గురైంది. దీంతో జాతీయ రహదారిపై నీరు రెండడుగుల మేర ప్రవహించింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది అక్కడకు చేరుకుని తాగునీటి సరఫరాను నిలిపివేశారు. పైపులైన్ లీకేజీ కారణంగా నీరంతా వృధాగా పోయింది.

నిలిచిన నీటిసరఫరా..

పైపులైన్ లీకేజీ కారణంగా ఎనిమిదవ వార్డు పరిధిలోని వెంకటేశ్వరకళ్యాణ మండపం నుంచి గౌతమ్ మోడల్ స్కూల్ వరకు, చైతన్య కళాశాల నుంచి కుమారస్వామి ఆలయం ప్రాంతం వరకు, తొమ్మిదవ వార్డు పరిధిలోని ఎన్‌టీఆర్ రోడ్డు, కృషి కాలేజ్ రోడ్డు తదితర ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు అవస్థలుపడ్డారు.

మరమ్మతులు చేపట్టిన సిబ్బంది...

పైపులైన్ లీకేజీని అరికట్టేందుకు మున్సిపల్ సిబ్బంది వెంటనే మరమ్మతులు చేపట్టారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ కంచికచర్ల మండలం కీసర నుంచి పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మరమ్మతు పనులు గురువారం రాత్రికి లేదా శుక్రవారం ఉదయానికల్లా పూర్తిచేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. అప్పటివరకు ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందిపడకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని కమిషనర్ వివరించారు.

లేబర్ కోడ్‌ను ఉపసంహరించాలి : సీఐటీయూ



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికసంఘాల నాయకులు, కార్మికులు

నందిగామటౌన్(కంచికచర్ల): లేబర్ కోడ్‌ను కేంద్రం వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. లేబర్ కోడ్ ఉపసంహరణ కోరుతూ బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ కార్మిక వర్గానికున్న కొద్దిపాటి హక్కులను కూడా కుదించేందుకే కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తీసుకువస్తోందన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రప్రభుత్వం రద్దు చేసిందన్నారు. కార్మికుల హక్కులను కాలరాసి పెత్తందారీ, పెట్టుబడిదారులకు పెద్దపీట వేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లు అధికారికంగా అమలులోకి రాకముందు నుంచే పరోక్షంగా అమలు చేస్తోందని మండిపడ్డారు. లేబర్ కోడ్‌ల వలన కలిగే ప్రమాదాన్ని ప్రతి ఒక్క కార్మికునికి తెలియజేసి కోడ్‌లను అడ్డుకునేందుకు సమాయత్తం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కర్రి వెంకటేశ్వరరావు, సయ్యద్ ఖాశీం, సలికేటి నరేష్, సైదా, మాణిక్యం, పిచ్చయ్య, రాజారత్నం, రూతమ్మ, బేబి, అశోక్, కార్మికులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్ తొలగింపు తగదు

తన్నీరు నాగేశ్వరరావు



బండి రాజు ఇంటివద్ద తొలగించిన మంచినీటి పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు

గండ్రాయి(జగ్గయ్యపేట): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ సానుభూతిపరుడు అనే నెపంతో గండ్రాయి ఎస్సీ కాలనీలోని బండి రాజు ఇంటికి ఉన్న మంచినీటి పైపులైన్‌ను పంచాయతీ అధికారులు తొలగించడం తగదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. బండి రాజు ఇంటికి మంచినీటి పైపులైన్ తొలగించిన విషయం తెలుసుకున్న ఆయన బుధవారం ఆగ్రామాన్ని సందర్శించి పైపులైన్ తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఫోన్ ద్వారా పంచాయతీ అధికారులను సంప్రదించారు. ఈసందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీ అధికారులు ఇలా కక్షపూరితంగా వ్యవహరించి పైపులైన్ తొలగించడమేమిటని వారిని ప్రశ్నించారు. తొలగించిన పైపులైన్‌ను వెంటనే సరిచేయాలని కోరారు. కార్యకర్తలపై కక్షపూరితంగా వ్యవహరిస్తే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామారావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహణ



మోడల్ టెస్ట్ పేపర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా స్థానిక విశ్వభారతి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పరీక్ష పేపర్‌ను విశ్వభారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జల్లా తిరుపతిరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గోపినాయక్, జిల్లా మహిళా కన్వీనర్ జాహిదా, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రణయ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపినాయక్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ప్రజ్ఞ వికాసం పదోతరగతి మోడల్ పరీక్ష జగ్గయ్యపేట పట్టణంతోపాటు మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 1000 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విశ్వభారతి డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



కొండూరు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అభిమన్యు

నందిగామటౌన్(కంచికచర్ల): నేరాల నియంత్రణ, ప్రస్తుత సమాజంలో ప్రజల భద్రతలో సీసీ కెమెరాల ప్రాధాన్యం ఎంతో పెరిగిందని ఎస్ఐ అభిమన్యు పేర్కొన్నారు. సురక్ష కార్యక్రమంలో భాగంగా నందిగామ మండలంలోని కొండూరులో బుధవారం రాత్రి సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు కారణంగా ఆయా చోరీలు, ఇతర నేరాలకు పాల్పడినవారికి త్వరితగతిన పట్టుకునేందుకు వీలుకలుగుతుందన్నారు. ఇబ్బందికర కేసుల్లోనూ వాస్తవాలను తెలుసుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని వివరించారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లతోపాటు ఇంటి పరిసరాలలో కూడా ప్రతిఒక్కరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు తోట నాగమల్లేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సుబాబుల్ తోట దగ్ధం

కంచికచర్ల: మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో బండ్లమూడి నారాయణకు చెందిన సుబాబుల్ తోటకు బుధవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవటంతో పూర్తిగా దగ్ధమైంది. ఫైర్‌ఆఫీసర్ కృష్ణమూర్తి కథనం మేరకు..గ్రామంలోని రైతు నారాయణకు చెందిన సుబాబుల్ తోటకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో ఎకరంపైగా తోట తగలబడిపోయింది. స్థానిక సమాచారం మేరకు ఫైర్‌సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకు మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదం ఘటనతో రూ.70వేల ఆస్తినష్టం వాటిల్లినట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

వీరులపాడు మండలంలో...

వీరులపాడు మండలం జుజ్జూరులో చోటుచేసుకున్న మరో ఘటనలో పి.నాగరాజుకు చెందిన మొక్కజొన్న తోట దగ్ధమైనట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు. ఈ ఘటనలో రూ.20వేలు ఆస్తినష్టం వాటిల్లినట్లు ఆయన వివరించారు. లీడింగ్ ఫైర్‌మెన్లు జె.శేఖరబాబు, షేక్ తాజుద్దీన్, రాజశేఖర్, జి.వి.నర్సయ్య, జి.జీవన్ పాల్గొని ఆయా ఘటనల్లో మంటలను అదుపు చేశారు.

కేంద్రబడ్జెట్ ప్రతులు దహనం

వత్సవాయి: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ బడ్జెట్‌లా ఉందని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మండేపుడి చంద్రశేఖర్ విమర్శించారు. బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయకుండా వ్యవసాయరంగాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో బుధవారం రైతుసంఘం ఆధ్వర్యంలో కేంద్రబడ్జెట్ ప్రతులను దహనం చేసి తమ నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్రం పెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా ఉందన్నారు. ఢిల్లీలో రైతులు ఆందోళన చేస్తుంటే వారికి అనుకూలంగా వ్యవసాయానికి ఉపయోగపడే పదమే బడ్జెట్‌లో లేదని విమర్శించారు. సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము, నాయకులు కంచర్ల కొండయ్య, గంగుల వెంకటేశ్వర్లు, కూరపాటి వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, కరిసె రత్నబాబు పాల్గొన్నారు.

సర్ఫ్, ఫినాయిల్ తయారీపై శిక్షణ

నందిగామటౌన్(కంచికచర్ల): నందిగామలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఎస్‌సి విస్తరణ సిబ్బందికి సర్ఫ్, ఫినాయిల్ తయారీపై బుధవారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రభావతి మాట్లాడుతూ ఈ శిక్షణ పొందినవారు ఆయా ఉత్పత్తులను ఇంటి వద్దనే తయారు చేసుకుని వాటిని విక్రయించడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. గృహిణులు, యువతకు అదనపు ఆదాయం సమకూర్చేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందని పేర్కొన్నారు. శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు అందజేశారు. సీడీపీవో భాగ్యరేణుక, ఏసీడీపీవో కృష్ణకుమారి, శాస్త్రవేత్తలు వెంకటరెడ్డి, రాజశేఖర్, జశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ పోస్టర్లు ఆవిష్కరణ



మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: ఈనెల 7వతేదీన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'లక్షల డప్పులు-వేల గొంతులు' మహాసభ వాల్ పోస్టర్లను స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తన్నీరు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి తమవంతు సహకారం ఉంటుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు, రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బూడిద నరసింహారావు మాట్లాడుతూ 30ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ జాతి పోరాడుతోందన్నారు. హక్కుల సాధన కోసం నిర్వహించే ఈ కార్యక్రమంలో వేలాది మంది మాదిగ సోదరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ గంగిపోగు రమేష్, అన్నెపాగ రమేష్, దుర్గారావు, శ్యామ్ లాక్, మాతంగి దావీదు, బొడ్డు వెంకటేశ్వర్లు, మార్కపూడి వంశీ, బోయ రంజిత్, గుంటి బాబు, రవీందర్, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బత్తుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన మిక్ విద్యార్థి



కంచికచర్ల: ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన గేమ్స్ మీట్ 100 మీటర్ల పరుగుపందెంలో మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో థర్డ్ ఇయర్ పాలిటెక్నిక్ చదువుతున్న కె.నిశ్చయ్ విశేష ప్రతిభను కనబరిచి ద్వితీయ బహుమతిని సాధించాడు. ఈసందర్భంగా కళాశాలలో బుధవారం విద్యార్థి నిశ్చయ్‌ను అభినందనసభ నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి.వంశీకిరణ్ మాట్లాడుతూ తమ విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా తర్ఫీదునిస్తున్నట్లు తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో కూడా విద్యార్థి నిశ్చయ్ గోల్డ్‌మెడల్ సాధించి, త్వరలో నిర్వహించనున్న జాతీయ క్రీడలకు ఎంపికైనట్లు వివరించారు. అథ్లెట్ నిశ్చయ్‌ని ప్రిన్సిపాల్‌తోపాటు ఫిజికల్ డైరెక్టర్ నిమ్మగడ్డ శౌరయ్య, మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ ఎం.సుహాన్, కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

22న మిక్ ఫెస్ట్...

స్థానిక మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో ఈనెల 22న 'మిక్ ఫెస్ట్2025' పేరుతో వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన కళాశాలలో గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల సీఈఓ డి.పాండురంగారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ ఎం.సుహాన్, మిక్ ఫెస్ట్ కోఆర్డినేటర్లు సీహెచ్ విజయకుమార్, డి.వరుణ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కొలతలు సరిచూస్తున్న ఎంపిడీవో నితిన్

గౌరవరం(జగ్గయ్యపేట): ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి జరిగితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపిడీవో నితిన్ హెచ్చరించారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు మస్టర్లు వేసే సమయంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇష్టానుసారంగా వేస్తే సహించేది లేదన్నారు. కేంద్రప్రభుత్వం ఈ పథకంలో అనేక నూతన మార్పులు తీసుకు వచ్చిందని, కొద్దిరోజుల్లో మండలవ్యాప్తంగా శిక్షణా తరగతులు నిర్వహించి కూలీలకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. జయంతిపురం గ్రామ సచివాలయాన్ని సందర్శించి అటెండెన్స్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని ప్రకృతి వ్యవసాయం విభాగం మాస్టర్ ట్రైనర్ జి.వన్నూరప్ప సూచించారు. గ్రామానికి చెందిన రైతులు లక్ష్మణరావు, ప్రభుకుమార్‌లకు చెందిన 80 సెంట్ల పొలంలో బుధవారం ఏటీఎం మోడల్ సాగు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రకాల మొక్కలు, 20 రకాల విత్తనాలు నాటడం ద్వారా రైతులకు నెలరోజుల నుంచే ఆదాయం సమకూరుతుందని వివరించారు. ముందుగా జీవామృతంతో విత్తన, నారు శుద్ధి చేసి, విత్తిన తరువాత ఘన జీవామృతం వేస్తామని వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం శిక్షకులు, రైతులు పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలం

నందిగామటౌన్(కంచికచర్ల): మండలంలోని దాములూరు కూడలిలో వేంచేసియున్న సంగమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో పలు హక్కులకు టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో బుధవారం ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాల నాలుగు రోజుల పాటు లడ్డూ ప్రసాదం అమ్ముకునే హక్కుకు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కుకు 7వతేదీ ఉదయం 10 గంటలకు టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నామన్నారు. దేవదాయ శాఖ నిబంధనల మేరకు నిర్వహించే వేలంలో ఆసక్తి కలిగినవారు పాల్గొనాలని కోరారు.

సిమెంట్ ఫ్యాక్టరీ సందర్శన

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని కేసీపీ సిమెంట్ కర్మాగారాన్ని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ బుధవారం సందర్శించారు. సిమెంట్ ఉత్పత్తికి వినియోగించే ముడిసరుకు, తయారీ విధానంతో పాటు కార్మికుల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులకు భద్రతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఫ్యాక్టరీ సిబ్బందికి సూచించారు. మెరుగైన వైద్యం కూడా అందించాలన్నారు. ఆయన వెంట నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, విజయవాడ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ శ్రీనివాస్, ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ మనోహర్ ఉన్నారు.



కేసీపీ కంపెనీ సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్

తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన



తిరునాళ్ల ఏర్పాట్ల పరిశీలిస్తున్న డీసీపీ మహేశ్వర రాజు, పక్కన ఈఓ కిషోర్‌కుమార్ తదితరులు

పెనుగంచిప్రోలు: ఈనెల 11న జరుగనున్న శ్రీతిరుపతమ్మవారి కల్యాణం, పెద్ద తిరునాళ్ల ఉత్సవాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను విజయవాడ పోలీస్ కమిషనరేట్ రూరల్ డీసీపీ మహేశ్వరరాజు బుధవారం పరిశీలించారు. ఆలయం వద్ద కల్యాణం నిర్వహించే స్థలాన్ని, మునేరు అవతల మామిడి తోటలో దీక్షాస్వాములకు నిర్వహించే అన్నదానం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్, జగ్గయ్యపేట సీఐ సి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్ పాల్గొన్నారు.